క్లుప్తంగా

సూర్యాపేట తండాలో క్రిస్మస్ క్యారెల్స్

చెన్నారావుపేట: మండలంలోని సూర్యాపేట తండాలో సోమవారం రాత్రి క్రిస్మస్ క్యారెల్స్ వైభవంగా నిర్వహించారు. పాస్టేట్ చైర్మన్ సహోదర్ ఆధ్వర్యంలో భక్తులు క్యాండిల్స్ వెలిగించి క్రిస్మస్ శుభంలు ప్రజలకు తెలియజేశారు. గీతాలు ఆలపిస్తు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో వరంగల్ గ్రూప్ సెక్రటరీ ఆకుల అశోక్‌గౌడ్, స్వప్న, లావణ్య, పాస్టేట్ సెక్రటరీ గోపు శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ అండ్ ఇవాంజలిజమ్ సెక్రటరీ గట్ల రవీందర్, యూత్ సెక్రటరి గట్ల హనోక్, ట్రజరర్ శంకేసి రంజిత్, స్త్రీల మైత్రి ట్రజరర్ ఆకుల సుభాషిణి, ఉన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

చెన్నారావుపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 (అంబులెన్స్) మంజూరు ఇచ్చినందుకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కాంగ్రెస్ నాయకులు, వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సరోజ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ మాట్లాడుతూ మండల ప్రజలకు అత్యవసర సేవల కోసం 108 వాహనాన్ని మంజూరు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నన్నెబోయిన రమేష్, నాయకులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

నర్సంపేట రూరల్ : మండలంలోని కమ్మపల్లికి చెందిన మేకల సమ్మక్క అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ మంగళవారం పరామర్శించి 50 కిలో బియ్యాన్ని అందించారు. పరామర్శించిన వారిలో మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, జ్యోతి, తాళ్ల రవీందర్, పులి సాంబశివుడు, పాండవుల రవీందర్, మధు, ఉన్నారు.

జీపీ కార్మికుల ముందస్తు అరెస్ట్

నల్లబెల్లి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు ప్రయత్నిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లను ఎస్సై గోవర్ధన్ మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఎండీ పాషా, రవి, రాజు, ఐలయ్య, లింగయ్య, స్వప్న, సమ్మయ్య, సూరమ్మ, లచ్చుమ్మ పద్మ, కర్ణ, రాధ ఉన్నారు.
పర్వతగిరి: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా జీపీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో కర్ణాకర్,రజనిబాబు, వెంకన్న, కొమురయ్య ఉన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

రాయపర్తి : బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కడియం వెంకటయ్య మృతి పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన కడియం వెంకటయ్య కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామపార్టీ నాయకులు ఉన్నారు.

కొండాయిల్‌పల్లిలో చోరీ

నల్లబెల్లి: మండలంలోని కొండాయిల్‌పల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన రామగిరి సతీశ్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి తాళంచెవిని కిటికీ లోపలివైపు ఉన్న రేడియో కింద పెట్టి వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న సతీష్‌కు ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని తులంపావు బంగారు, 5 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.50 వేలు నగదు కనిపించలేదు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమ్మెలో ఉద్యోగులు.. పాఠాలు బోధిస్తున్న ఎంఈఓ

సంగెం : సమగ్ర శిక్షలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమ్మె చేస్తున్నారు. 8 రోజులుగా హన్మకొండలోని ఏకశిల పార్కు వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేస్తున్న విషయం విధితమే. దీంతో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఎంఈఓ రాము విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు పీఆర్‌టీ యూ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాంతారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, సంఘీభావం తెలియజేశారు.

కార్యకర్తలు కృషి చేయాలి

రాయపర్తి: గ్రామస్థాయిలో పార్టీ బలోపేతంకోసం బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండల ఎన్నికల అధికారి పూసల శ్రీమాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూనె అనిల్ అధ్యక్షతన నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- 780 మంది రైతుల నుంచి సేకరణ
- సన్నాలు అధికం..దొడ్డు అత్యల్పం


ఖానాపురం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు


కాంటాలు వేస్తున్న హమాలీలు

ఖానాపురం : ధాన్యం కొనుగోళ్లను సొసైటీ అధికారులు ముమ్మరంగా చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి సేకరిస్తున్నారు.. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో రైతుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. ధాన్యాగార కేంద్రంగా గుర్తింపు పొందిన పాకాల ఆయకట్టు కింద వరి పంటలు సాగయ్యాయి. ఆయకట్టు కింద ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట ప్రాంతాలకు చెందిన రైతులు 29,500 ఎకరాల్లో వరి పంట సాగు చేసుకున్నారు. వీటిలో అధికంగా సన్న రకాలకు రైతులు ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పటికే పాకాల ఆయకట్టు కింద వరి కోతలు పూర్తయ్యాయి. ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు పలు రైతుమిత్ర సంఘాలు, చెన్నారావుపేట సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేయిస్తున్నారు. ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు 780 మంది రైతుల వద్ద రూ.27 కోట్ల 80లక్షల 90వేల 300 విలువ చేసే 1,06, 285 బస్తాల ధాన్యంను కొనుగోలు చేశారు. ఇందులో 94,899 ఏ గ్రేడ్ ధాన్యం, 11,386 కామన్ రకాల ఉన్నాయి. వీటికి సంబంధించిన డబ్బులు సుమారు 60 శాతం రైతుల ఖాతాల్లో జమ అయినట్లు సొసైటీ అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ముమ్మరంగా కొనుగోలు చేస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఆయకట్టు పరిధిలో సన్నాలు అధికంగా సాగు చేసుకున్న రైతులకు ప్రైవేట్ వ్యాపారులు సరైన ధరలు కల్పించకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. బోనస్‌తో కలిపి క్వాంటాకు రూ.2820 పడుతుండటంతో కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకుంటున్నారు. చిట్టిపొట్టి, జై శ్రీరాం వంటి రకాలను మాత్రమే ప్రైవేట్‌గా కొంతమేర కొనుగోళ్లు జరుపుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చెన్నారావుపేట : సీఎం బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం తేజావత్ జయ తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరంగల్ ఓ సిటీ చింతల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు డి.అక్షిత, డి.జస్వంత్‌లు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఈ నెల 18 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగెం: సీఎం కప్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె. విజయ, పీడీ ముఖర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో ఈనెల 17న చింతల్ గ్రౌండ్స్‌లో జరిగిన పోటీల్లో జి.చిన్ను (8వ తరగతి), పి.ప్రణయ్‌వర్ధన్(9వ తరగతి), ఎస్.సాయిచరణ్(10వ తరగతి)లు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఎస్ఎంసీ చైర్‌పర్సన్ శ్రీలత, ఉపాధ్యాయులు అభినందించారు.

'కాకతీ కదన భేరి'ని విజయవంతం చేయాలి

నర్సంపేట: వరంగల్‌లో ఈనెల 22న నిర్వహించనున్న 'కాకతీ కదనభేరి'ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ పిలుపునిచ్చారు. డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో మంగళవారం కదన భేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2025 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 22వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిన్నారపు బుచ్చన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్‌కుమార్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ చంద్రకళ, రమేశ్, బి.రాజు, పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నర్సంపేట: పరకాలలో జనవరి 3న జరిగే సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను విజయవంతం చేయాలని విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జగదీశ్వర్ పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం జయంతి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యాభిమానులు, అంబేద్కరిస్టులు, స్వేరోస్, ప్రజా సంఘాల నాయకులు, రాజ్యాంగ అభిమానులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అమ్మ ఒడి సుభద్ర శ్యామల, జిల్లా నాయకులు బొచ్చు రాజు, జోనల్ నాయకులు పాల్గొన్నారు.

'చపాట' మిర్చి తోటల పరిశీలన


మిరపతోటను పరిశీలిస్తున్న సంగీతలక్ష్మి

దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేట గ్రామంలో వరంగల్ చపాట రకం మిరప తోటలను జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి మంగళవారం పరిశీలించారు. వరంగల్ చపాట రకం మిరప సాగు చేస్తున్న రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నాటింది మొదలు పంట చేతికొచ్చే వరకు రైతులు తీసుకున్న జాగ్రత్తలు విని వారిని అభినందించారు. అనంతరం స్థానిక చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ(రైతు ఉత్పత్తిదారుల సంఘం) కార్యాలయాన్ని సందర్శించి సంఘం సభ్యులతో మాట్లాడారు. మారుమూల గ్రామం నుంచి వరంగల్ చపాట రకం మిరప జీఐ ట్యాగ్ సాధించడం చారిత్రాత్మకమన్నారు. సమష్టిగా ఉండి అరుదైన మిరప పండిస్తూ మరింత ప్రగతి సాధించాలని ఆమె అన్నదాతలకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యానశాఖ అధికారి అల్లకొండ జ్యోతి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరహరి రాజుకుమార్‌రెడ్డి, శోభన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటుకు సానుకూలం

- ఐదు గ్రామాలు ఓకే.. మిగిలింది ఒక్కటే


మున్సిపల్ ఏర్పాటుకు సానుకూలంగా చేతులెత్తిన గుండ్రపల్లి గ్రామస్తులు

నెక్కొండ: నెక్కొండ మున్సిపాలిటీ ఏర్పాటుకు అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే నెక్కొండ, నెక్కొండ తండా, పత్తిపాక గ్రామాలు మున్సిపాలిటీ ఏర్పాటుకు మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే. అయితే మిగిలిన మూడు గ్రామాలకు గాను మంగళవారం గుండ్రపల్లితోపాటు అమీన్‌పేటలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో ప్రజలు మున్సిపాలిటీ ఏర్పాటుకు అనుకూలంగా చేతులెత్తి ఆమోదం తెలపడంతో తీర్మానించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. కాగా వాయిదా పడ్డ మరో గ్రామం టేకులకుంట (టీకే) తండాలో త్వరలో ప్రజాభిప్రాయ గ్రామసభ నిర్వహిస్తామని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తదుపరి మున్సిపాలిటీ ఏర్పాటు తీర్మాన నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీఓ సునీల్‌కుమార్, ఎస్సై మహేందర్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ దయాకర్, గ్రామ కార్యదర్శులు రవికుమార్, ప్రియాంక, ప్రత్యేక అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్లతో ఆర్థిక స్వావలంబన

- డీఆర్‌డీఓ కౌసల్యాదేవి


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

సంగెం: సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అన్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై సంగెం శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎం కుసుమ్ పథకంలో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను స్థాపించేందుకు ప్రభుత్వ స్థలాలను మహిళా సంఘాలకు లీజుకు ఇస్తారన్నారు. రైతులు, సొంతంగా లేక ఏదైనా సహకార, స్వయం సహాయక సంఘాలు, కంపెనీ భాగస్వామ్యంతో అదనపు ఆదాయం పొందేలా పొలాల గట్లపై, బీడు భూముల్లో సౌరవిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు మార్గదర్శకాలు రుపొందిస్తున్నారన్నారు. టెక్స్‌టైల్ పార్కు నిరుద్యోగ యువతకు సర్వే, పాల ఉత్పత్తిదారుల సొసైటీ, కిశోర బాలికల సంఘాలు, కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు లింకేజీ రుణాలు, ఎంటర్‌ప్రైజెస్ తదితరు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రేడీకో డీఎం మహేందర్‌రెడ్డి, ఎన్పీడీసీఎల్ డీఈ భిక్షపతి, ఏపీడీ రేణుకాదేవి, డీపీఎంలు సరిత, భవాని, ఎంపీఎం కిషన్, మండల సమాఖ్య అధ్యక్షకార్యదర్శులు కల్యాణి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పూర్తి చేయాలి

దుగ్గొండి: ఈ నెలాఖరులోగా మండలంలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్‌ను పూర్తి చేయాలని ఎంపీడీఓ అరుంధతి అన్నారు. మండలంలోని నాచినపల్లిలో నర్సరీలలో మొక్కలు నాటడానికి బ్యాగ్‌లలో మట్టి నింపే కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేశారు. మట్టిని పొడిచేసి జల్లెడ పట్టి మట్టిని సంచుల్లో నింపాలని సూచించారు. అలాగే గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు.

అయ్యప్పమాల వేసుకున్నాడని..

- ఇంటికి పంపించిన స్కూల్ యాజమాన్యం



నెక్కొండ: ఓ విద్యార్థి అయ్యప్ప స్వామి దుస్తులు (దీక్షవస్త్రాలు) ధరించి స్కూల్‌కు రావడంతో ప్రిన్సిపాల్ అడ్డుకున్న ఘటన మండలంలోని రెడ్లవాడ ఆర్డీఎఫ్ స్కూల్‌లో చోటుచేసుకుంది. మండలంలోని సాయిరెడ్డిపల్లికి చెందిన రుద్రశేఖర్‌తోపాటు ఆర్డీఎఫ్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న అతని కుమారుడు జ్యోతేంద్ర అయ్యప్ప మాల ధరించారు. దీంతో దీక్ష దుస్తులు ధరించి పాఠశాలకు రావొద్దని ప్రిన్సిపాల్ చేరాలు విద్యార్థిని మందలించాడు. అప్పటి నుంచి జ్యోతేంద్ర స్కూల్ యూనిఫాంతో పాఠశాలకు వెళ్తున్నాడు. ఈక్రమంలో దీక్ష దుస్తులతో పాఠశాలకు రావొద్దని ప్రిన్సిపాల్ వారించినట్లుగా విద్యార్థిని వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. విషయం తెలుసుకున్న మాలధారులు పాఠశాలకు వెళ్లి ప్రిన్సి పాల్‌ను నిలదీయగా మరోసారి తప్పు జరగకుండా చూస్తామని చెప్పడంతో శాంతించారు.

అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట : సమాజంలో పెరిగిపోతున్న అవినీతి అక్రమాలు, ప్రభుత్వ భూముల కబ్జాలకు వ్యతిరేకంగా పేదలను సమీకరించి యువత పోరాడాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో మంగళవారం పట్టణ యూత్ సమావేశం బండారి మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన పాలకులు పెట్టుబడి వర్గాల కనుసన్నల్లో పని చేస్తూ పాశ్చాత్య సంస్కృతిని పెంపొందిస్తున్నారని అన్నారు. విచ్చలవిడిగా మత్తు పానీయాలను, డ్రగ్స్, అశ్లీల చిత్రాలను ప్రోత్సహిస్తూ యువతను పెడదోవ పట్టిస్తూ వ్యసనాల వైపు మళ్లిస్తున్నారని తెలిపారు. నిలువ నీడ లేక పేదలు ఇంటి స్థలాలు, ఇళ్ల కోసం ఎదురు చూస్తుంటే విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసి కోట్లు గడిస్తున్న వారికి ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలుస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ భూముల రక్షణకు యువతలో చైతన్యం నింపేందుకు ప్రభుత్వ ఆస్తుల రక్షణకు పోరాటాలను చేయాలన్నారు. సమావేశంలో పట్టణ నాయకులు ఈర్ల రాజు, కసుబాల సతీష్, రాజేష్, పవన్, కల్యాణ్, రతన్‌కుమార్, రాజు, కార్తీక్, యాకయ్య, రాజేష్, బాబా, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- మట్టెవాడ సీఐ గోపి


మాట్లాడుతున్న సీఐ గోపి

గీసుకొండ: ఎవరైనా మహిళలను వేధిస్తుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని, అలాంటి వారిపై షీ టీం చర్యలు తీసుకుని కఠినంగా వ్యవహరించడమే కాకుండా కేసులు నమోదు చేస్తారని మట్టెవాడ సీఐ గోపి అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో షీ టీంలు, భరోసా కేంద్రాల సేవలు, విధులపై ఆశ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. షీ టీంల ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 250 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. భరోసా సెంటర్ సపోర్టింగ్ స్టాఫ్ రజిత మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షిస్తున్నామని అన్నారు. ఉచితంగా న్యాయ సహాయం, కౌన్సిలింగ్, విద్య, వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో షీ టీం ఎస్సైలు విద్యాసాగర్, విఠల్, వంశీకృష్ణ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, డీపీహెచ్ఎన్ఓ జ్ఞాన సుందరి, సుమలత పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి


నర్సంపేట : అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


వర్ధన్నపేటలో: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

నర్సంపేట : లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని నర్సంపేట, వర్ధన్నపేట, సంగెం, నెక్కొండ, గీసుకొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, రాయపర్తి, మండలాల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లో అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులపై అక్రమంగా కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైల్లో నిర్బంధించడం దుర్మార్గమన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్ష,కార్యదర్శులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

21న పట్టభద్రుల దినోత్సవం

నర్సంపేట రూరల్ : పట్టభద్రుల దినోత్సవం ఈనెల 21న నిర్వహించనున్నట్లు బిట్స్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వాల్ పోస్టర్ ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి 600 మంది ఇంజనీరింగ్, బీఫామ్, ఎం ఫామ్, ఎంబీఏ, నర్సింగ్ విభా గాలకు చెందిన విద్యార్థులకు పట్టాలు అందించడం జరుగుతుందన్నారు.

ఐకేపీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నల్లబెల్లి: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–టీ సెర్ప్ ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఇటీవల అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఐకేపీ అధికారులను ఆదేశించినా పట్టించుకోవడంలేదని, వారి ఆదేశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా మండల సమాఖ్య కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నా వద్దకు చేరుకొని ప్రజా సంఘాల నాయకులతో చర్చించి విరమింపజేశారు. ప్రజా సంఘాల నాయకులు సాంబయ్య, ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంల్లో కనీస వసతులు కల్పించడం లేదన్నారు.

ఘనంగా పెన్షనర్స్‌డే

నెక్కొండ: మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఆ సంఘం నెక్కొండ యూనిట్ అధ్యక్షుడు గటిక మల్లయ్య ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా జరి గాయి. మంగళవారం పెన్షనర్లను ఎస్‌బీఐ నె క్కొండ శాఖ మేనేజర్ వెంకన్న సన్మానించి మా ట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల సూచనలు, సలహాలు తీసుకుంటూ నేటి ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్ర లక్ష్మీనారాయణ, నర్సింహారెడ్డి, సత్యనారా యణ, సుభద్ర, ఉపేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

రాయపర్తి: మండలంలోని సన్నూరు వెంకటేశ్వరపల్లిలోని పురాతన ఆలయంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏ ర్పాటు చేశారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధి నేత, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సీసీ కెమెరాలను ఏ ర్పాటు చేస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి సురేందర్‌నాయక్‌రాథోడ్ తెలిపారు. ఫౌండేషన్ ప్రతి నిధి ఎండీ యూసుఫ్, మాజీ సర్పంచ్ యా కమ్మ ఎల్లయ్య, రంగాచార్యులు, పాల్గొన్నారు

డాక్టరేట్ పొందిన గిరిజన బిడ్డ

చెన్నారావుపేట: మారుమూల తండాకు చెందిన ఓ గిరిజన యువకుడు పట్టుదలతో చదివి డాక్టరేట్ పట్టా అందుకుని పలువురితో శభాష్ అని పించుకొని ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని ఎల్లాయగూడెం శివారులోని కొర్ర తండాకు చెందిన కొర్ర చత్రు, పూలమ్మ కుమారుడు బాలు ఎంహెచ్‌ఆర్‌డీ నుంచి నేషనల్ ఫెలోషిప్‌కు ఎంపికై ప్రొఫెసర్ వివేకానంద ముఖర్జీ గైడెన్స్‌లో అమెండెడ్ వెర్సివెన్స్ ఆఫ్ స్టూడెంట్ సైకాలజీ బెస్ట్ ఆప్టిమైజేషన్ అల్గోరిథం ఫర్ డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ అలోకేషన్ ఇన్ రేడియాల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అంశంపై పరిశోధనకు డాక్టరేట్ పొందాడు. తండాలో జన్మించి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీలో మాస్టర్, డాక్టరేట్ పట్టా పొందడంతో గ్రామస్తులు అభినందించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ అర్చకులు దేవిష్‌మిశ్రా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాధవశంకర్ మాట్లాడుతూ డిసెంబర్ 22న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో పాటు పలువురు అన్నదానం, పడి పూజలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

అధికారులకు సహకరించాలి

వర్ధన్నపేట/నల్లబెల్లి/చెన్నారావుపేట : ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం మండలంలో ఇంటింటి సర్వే అధికారులు నిర్వహిస్తున్నారని, అధికారులకు లబ్ధిదారులు సహకరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, చిట్యాల తిరుపతిరెడ్డి, భూక్య గోపాల్‌నాయక్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దరఖాస్తుదారులు అధికారుల వద్ద ఉన్న యాప్‌లో వారి వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యేలు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేస్తారన్నారు.

నోటీసు బోర్డులో పోలింగ్‌స్టేషన్ల వివరాలు

పర్వతగిరి: మండలంలోని 33 గ్రామపంచాయతీల పోలింగ్ స్టేషన్ల వివరాల ఫైనల్ కాపీని మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డులో పెట్టారు. ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ మాట్లాడుతూ అన్ని గ్రామపంచాయతీల్లో నోటీసు బోర్డులో వివరాలను పెట్టడం జరుగుతుందని తెలిపారు.
వర్ధన్నపేట: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఫైనల్ లిస్ట్ ఆఫ్ పోలింగ్ స్టేషన్ల ప్రకటన విడుదల చేయడం జరిగిందని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్‌స్టాఫ్‌తో కలిసి నోటీసు బోర్డులో అతికించారు.
దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం ప్రదర్శించారు. మండల పరిధిలోని 34 గ్రామపంచాయతీల పరిధిలో 282 వార్డులకు గాను 282 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

పర్వతగిరి: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) తెలంగాణ రాష్ట్ర జాక్ కమిటీ పిలుపు మేరకు వరంగల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న నిరవధిక సమ్మెలో మంగళవారం స్థానిక ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.
చెన్నారావుపేట : సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ మద్దతు ఇస్తున్నట్లు మండల అధ్యక్షుడు పూజారి సురేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బానోతు వెంకన్న అన్నారు.

పల్లె ప్రకృతి వనం దగ్ధం

నర్సంపేట : వరికోసిన గడ్డిని తగులబెట్టగా కాలుకుంటూ వచ్చి ప్రమాదశాత్తు పట్టణంలోని వివేకానంద కాలనీలోని పల్లె ప్రకృతి వనం దగ్ధమైన సంఘటన పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. కాలనీలో ప్రభుత్వ స్థలంలో నర్సంపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసిన మొక్కలు పెంచుతున్నారు. అయితే పక్కనే వ్యవసాయ భూములు ఉండడంతో వరి గడ్డిని తగులబెట్టగా ప్రమాదశాత్తు పల్లె ప్రకృతి వనం అంటుకోవడంతో దగ్ధమైంది. స్థానికులు గమనించిన మంటలను ఆర్పేశారు. అప్పటికే పల్లె ప్రకృతి వనంలో ఉన్న బోరు, పైపు, స్టాటర్, వైర్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి.

పాయింట్స్‌మన్ కుటుంబానికి ఆర్థికసాయం



సంగెం: ఎల్గూర్‌స్టేషన్‌లో ఆన్‌డ్యూటీలో రైలు ఢీకొని మృతిచెందిన పాయింట్స్‌మన్ రమేశ్ కుటుంబానికి మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. మంగళవారం ఎంజీఎం మార్చురీ వద్ద రమేశ్ పార్థివదేహాన్ని యూనియన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. యూనియన్‌లో సభ్యత్వం కలిగిన ఉన్న కుటుంబానికి డివిజనల్ సెక్రటరీ పి.రవీందర్ ఆదేశాల మేరకు కాజీపేట, వరంగల్ యూనియన్ కార్యదర్శులు ఆర్.సమ్మయ్య, యుగంధర్, చైర్మన్ ముకుందం చేతులమీదుగా మృతుడి భార్య రజితకు ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట యూనియన్ నాయకులు సుధాకర్, రాజేష్, యూత్ ప్రెసిడెంట్ విజయ్, సురేష్, సతీష్ ఉన్నారు.

జీరోటిల్లేజ్ పద్ధతి లాభదాయకం


పంటను పరిశీలిస్తున్న అధికారులు

రాయపర్తి : మొక్కజొన్న జీరోటిల్లేజ్ పద్ధతిలో సాగు చేయడంతో పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి పెరిగి రైతుకు ఆదాయం వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొండాపురంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఆమె మాట్లాడుతూ ఈ జీరోటిల్లేజ్ పద్ధతిలో సాగు చేయడం వల్ల దుక్కి చేయకుండా వరికోసిన పొలంలోనే నేరుగా మొక్కజొన్న విత్తనంను ట్రిల్లర్‌గానీ, డిగ్గర్‌తో గానీ విత్తనాన్ని విత్తుకోవచ్చన్నారు. మొక్కజొన్నలో సస్యరక్షణలో భాగంగా కత్తెరపురుగు నివారణకోసం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రం, ఏఈఓ రాజేష్ పాల్గొన్నారు.